క్లుప్తంగా

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ తైమూర్‌బాషా

కోడుమూరు రూరల్ : ప్రభుత్వ నిబంధనలను ప్రైవేట్ పాఠశాలలు పాటించాలని ఎంఈఓ తైమూర్‌బాషా సూచించారు. మంగళవారం కోడుమూరులోని ప్రైవేట్ పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేశారు. పాఠశాలలకు సంబంధించిన రికార్డులను, తరగతి గదులను ఆయన పరిశీలించారు. విద్యార్థులతోపాటు సిబ్బందితో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల యాజమన్యాలు విద్యార్థులకు సంబంధించిన అపారు జనరేషన్, ఎఫ్ఏవన్ పరీక్ష మార్కులు చాలా తక్కువగా అప్లోడ్ చేశారని, త్వరగా పూర్తి చేయాలని ఎంఈఓ ఆదేశించారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



ఇనగండ్లలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఈ వెంకటప్రకాష్

సి.బెళగల్: మండల పరిధిలోని ఇనగండ్లలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం మండల పంచాయతీ రాజ్ ఏఈ వెంకటప్రకాష్ పరిశీలించారు. నాణ్యతగా నిర్మించాలని ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని గ్రామ సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్ వెంకటేశ్వరమ్మకు ఏఈ సూచించారు.

మరుగుదొడ్లను నాణ్యతగా నిర్మించాలి



పోలకల్‌లో మరుగుదొడ్డి కొలతలను తీసుకుంటున్న అధికారులు

సి.బెళగల్: మండలంలోని ఆయా గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలకు అనుసంధానంగా నిర్మిస్తున్న మరుగుదొడ్లను నాణ్యతగా నిర్మించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం ఆయన ఏఈ గోనెనాయక్‌తో కలిసి పోలకల్, కంబదహాళ్ గ్రామాలలో పర్యటించారు. ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల దగ్గర నిర్మిస్తున్న మరుగుదొడ్లు, మరమ్మతు పనులను పరిశీలించారు.

దాతల సేవలు అభినందనీయం



సకల దీక్షదారులకు అన్నదానం చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: సకల దీక్షదారులకు అన్నదానం చేస్తున్న దాతల సేవలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ పరిధిలోని 32వ వార్డులోని అశ్వర్థ నారాయణ సాయిబాబా మందిరంలో సకల దీక్షదారులకు అన్నదానం కార్యక్రమానికి హాజరై ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మల్లారెడ్డి, కార్పొరేటర్ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కొత్తూరులో కాలసర్పదోష పూజలు



స్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు


పాణ్యం: మండల పరిధిలోని కొతూత్రు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం నిర్వహించిన కాలసర్పదోష పూజలు భక్తిశ్రద్ధల మధ్య సాగాయి. స్వామివారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునే మహిళలు ఆలయంలో కార్తీక దీపాలు వెలగించారు. స్వామి వారికి అభిషేకాలు, నైవేద్య సమర్పణలు చేశారు.



దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

ఉల్లి రైతులు ఉక్కిరిబిక్కిరి !

- మార్కెట్‌లో లభించని గిట్టుబాటు ధర
- ఈఏడు విపరీతంగా పెరిగిన పెట్టుబడి ఖర్చులు
- అన్నదాతల ఇబ్బందులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం



కన్నమడకలలో ఉల్లి దిగుబడులను సంచులకు నింపుతున్న దృశ్యం

ఓర్వకల్లు: ఉల్లిరైతులకు నిరాశే మిగిలింది. గిట్టుబాట ధర లేకపోవడంతో నష్టాలు మూటకట్టుకోవాల్సివస్తుంది. వర్షాభావ పరిస్థితులకు ఎదరొడ్డి నిలిచిన రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారం కింద మండలంలో ఉల్లి పంట విస్తారంగా సాగు చేశారు. కన్నమడకల, పూడిచెర్ల, కేతవరం, బ్రాహ్మణపల్లె, కొమరోలు, ఉప్పలపాడు, ఉయ్యాలవాడ, లొద్దిపల్లె తదితర గ్రామాలలో మొత్తం 1,588 ఎకరాలలో ఉల్లి పంటను సాగు అయ్యింది. కన్నమడకల, ఉప్పలపాడు గ్రామాల్లో ఏకంగా 800 ఎకరాలల్లో ఉల్లి పంటను సాగు చేయడం విశేషం. ఎకరానికి సగటున 70–80 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. అయితే పంట కోత సమయానికొచ్చే సరికి మార్కెట్‌లో ధరలు క్రమేనా తగ్గుముఖం పట్టాయి. ముందుగా కోతల కోసిన కొందరు రైతులు కొంతమేర లాభాలు తీసుకున్నారు. మిగతా 85 శాతం మంది రైతులు ఉల్లి దిగుబడులు అమ్ముకోవాల్సి ఉంది. అయితే మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడం లేదు. దీంతో ఉల్లి రైతులు అయోమయానికి గురవుతున్నారు. మొదట్లో క్వింటాం రూ.4500 ధర పలికిన ఉల్లి ఒక్కసారిగా తగ్గిపోయాయి. ప్రస్తుతం ఏకంగా రూ. 2000 వరకు ధర దిగజారిపోవడంతో రైతులకు నేల చూపు తప్పడం లేదు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని టీడీపీ కూటమి సర్కార్ తీరుపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు అండగా నిలిచిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్నివిధాలుగా అండగా నిలిచింది. సీజన్‌కు అనుగుణంగా రైతభరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందజేయడంతోపాటు ఉచిత పంటల బీమా, గిట్టుబాట ధర తదితర పథకాలను అమలు చేసింది గత జగన్ ప్రభుత్వం. అయితే గత ఎన్నికల్లో ఆకాశమే హద్దుగా హామీలు గుప్పించి గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెట్టుబడి సాయం ఏకంగా రూ. 20 వేలు అందజేస్తామని ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు విస్మరించారని రైతులు మండి పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ పోయి రబీ సాగు పనులు సాగుతున్నా పెట్టుబడి సాయం ఊసెత్తని టీడీపీ కూటమి పెద్దల తీరును తప్పుపడుతున్నారు రైతులు. గత ప్రభుత్వం అండగా నిలిచిన సందర్భాలను రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

రైతుల సమస్యలపై దృష్టి సారించాలి



కూటమి ప్రభుత్వం రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. వర్షాభావ పరిస్థితులు, గిట్టుబాటు ధరలు లేనందున రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది ఉల్లి రైతుల కష్టాలు వర్ణనాతీతం. ధరలు అనుకూలించక విలవిలలాడిపోతున్నాం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలానే టీడీపీ కూటమి సర్కార్ అన్నివిధాలుగా రైతులకు అండగా నిలుస్తే బాగుంటుంది.

– వడ్డె.లక్ష్మన్న, ఉల్లి రైతు, కన్నమడకల గ్రామం

భారీగా పెరిగిన పెట్టుబడి ఖర్చులు

సాగు పెట్టుబడి ఖర్చులు ఈ ఏడు భారీగా పెరిగాయి. గతంలో 28:28:28 ఎరువు బస్తా రూ.1,800 ఉండగా ప్రస్తుతం బస్తా రూ.2,200 వరకు చేరుకుంది. అలాగే ఒక బస్తా డీఏపీ రూ.1,200 ఉండగా, ప్రస్తుతం రూ.1,700 వరకు పెరిగింది. ఇలా ప్రతి బస్తామీద రూ.400 చొప్పున అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఎకరా ఉల్లి పంట సాగుకు 12–15 బస్తాల రసాయన ఎరువులు, క్రిమిసంహారక (నీళ్ల మందులు)మందులు ఒక డోస్‌కు రూ.2500ల చొప్పున కొనుగోలు చేసి 10 డోస్‌లకు రూ.25 వేలు ఖర్చు చేయాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు. ఎరువుల ధరలను నియంత్రించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు రైతులు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



నేను 2.50 ఎకరాలలో ఉల్లి సాగు చేశా. పంట కోతకు వచ్చే సరికి మార్కెట్‌లో ధరలు తగ్గిపోవడంతో నష్టపోతున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రకాల పంట దిగుబడులకు గిట్టుబాటు ధరలేదు. ప్రధానంగా ఉల్లి పంటను ప్రభుత్వమే గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసి ఆదుకోవాలి. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని గిట్టుబాటు ధరలు కల్పిస్తే బాగుంటుంది.

– తెలుగు తిరుపతయ్య, ఉల్లి రైతు, కన్నమడకల గ్రామం

గిట్టుబాటు ధర కల్పించాలి



ధరలు బాగుంటాయని నా కున్న రెండు ఎకరాలలో ఉల్లి పంటను సాగుచేసుకున్నా. ఎకరానికి సుమారు 60–70 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పెట్టుబడి ఖర్చులు భారీగా అయ్యాయి. చివరకు మార్కెట్‌లో ధరలులేక పెట్టుబడి ఖర్చుకూడ వస్తుందో? లేదోనని భయంగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం కల్పించుకొని గిట్టుబాటు ధరకల్పించాలని కోరుతున్నా.

– గొల్ల.మధు, ఉల్లి రైతు, కేతవరం గ్రామం

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : కంది పంటకు తెగుళ్లు, గూడు పురుగు సోకుతున్నప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టి పైరును చీడపీడల నుంచి రక్షించుకోవాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. మంగళవారం మండలంలోని వర్కూరు గ్రామంలో ఏఓ రవిప్రకాష్ రైతులతో కలిసి కంది పంట సాగుపై ।పొలం పిలుస్తోంది॥ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ శనగ పంట ప్రస్తుతం మొలకదశలో ఉన్నందున కొన్ని రోజుల పాటు పురుగు మందులను పిచికారీ చేయాల్సిన అవసరం లేదన్నారు. 20రోజుల తర్వాత వేప నూనె, ఆస్ఫేట్ కలిపి శనగకు పిచికారీ చేస్తే సరిపోతుందని ఏఓ సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏఓ మాధురి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పోలకల్లో రైతుకు పంట నమోదు పత్రంను అందజేస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో మంగళవారం ఏఓ మల్లేష్‌కుమార్ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రైతులకు వ్యవసాయంలో చేట్టాల్సిన సంరక్షణ పద్ధతులను, ఆధునిక వ్యవసాయ పద్ధతులను, వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులను వివరించారు. పంట నమోదు చేయించుకున్న రైతులకు ధృవపత్రాలను ఏఓ అందజేశారు.

ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేయండి



ప్రకృతి వ్యవసాయ పుస్తకాలను అందజేస్తున్న అధికారులు

ఓర్వకల్లు: మహిళలు పొదుపు సంఘాలను ఏలా బలోపేతం చేశారో? అదే తరహారాలోనే ప్రకృతి వ్యవసాయాన్ని చేయాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పొదుపు భవన్‌లో పొదుపు మహిళలకు జరిగిన నెలవారి సమావేశంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ప్రయోజనాలుపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని సూచించారు. అడిషనల్ డీపీఎం లక్ష్మయ్య ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. గ్రామ సంఘం సభ్యులకు ప్రకృతి వ్యవసాయ కషాయాలకు సంబంధంచిన పుస్తకాలను పంపిణీ చేశారు. సమావేశంలో ఏపీఎం వెంకటరామిరెడ్డి, ఎంఎంటీఎల్ వంశీకృష్ణ, హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఎస్ఎఫ్ఎఫ్ తేజస్విని, ఎంటీ కాసీం, ఎల్–1 వెంకటరమణ, ఎల్–2 శ్రీకాంత్, శివ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గత ప్రభుత్వం ఆమోదించిన జీఓలను విడుదల చేయాలి



మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రమిస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశా కార్యకర్తలు

కల్లూరు: గత ప్రభుత్వం ఫిబ్రవరి నెలలో ఆశా వర్కర్ల సమస్యలపై యూనియన్ నాయకులతో జరిపిన చర్చలలో ఆమోదించిన జీఓలను విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు సీహెచ్ సాయిబాబా, సుధాకరప్ప, యేసు డిమాండ్ చేశారు. మంగళవారం ఆశా డే సందర్భంగా కల్లూరు అర్బన్ పరిధిలోని కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వీకర్‌సెక్షన్ కాలనీ, ముజఫర్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లకు ఆశా కార్యకర్తలతో కలసి సీఐటీయూ నాయకులు వినతి పత్రమిచ్చారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు జ్యోతి రాణి, రజినీ, ఇమాంబీ, సెహ్నాజు, మహేశ్వరి, శ్రీదేవి, మద్దమ్మ, నాగేశ్వరి, యశోదమ్మ, సుంకులమ్మ, జహ్రాబీ, పుణ్యవతి, ఇందిర, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

పాణ్యం: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అందించాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు మద్దూరు పీహెచ్‌సీ డాక్టర్ సునీతకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు రూ.10లక్షల బీమా కల్పించాలని, ప్రయాణ ఖర్చులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు యూనియన్ నాయకురాళ్లు సుబ్బరత్నమ్మ, సునంద, అభిషేకమ్మ, సారలీలమాణి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ సునీతకు వినతి పత్రం అందిస్తున్న ఆశావర్కర్లు



వైద్యాధికారి జయంతికి వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

కోడుమూరు రూరల్ : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం ఆపేది లేదని సీఐటీయూ మండల కార్యదర్శి వీరన్న ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు లద్దగిరి పీహెచ్‌సీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం మేరకు జీఓలను అమలు చేయకపోవడంతో ఆశావర్కర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యల సాధనలో భాగంగా ఈనెల 18న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమానికి ఆశా వర్కర్లు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం వినతిపత్రాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారిణి జయంతికి అందజేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల యూనియన్ నాయకురాళ్లు సుబేదా, సరోజ, నాగలక్ష్మి, గోవిందమ్మ, ఆశ, సరస్వతి, రేణుక, విమల, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు సమస్యలను పరిశీలించిన ఆర్‌డీఓ

కర్నూలు(రూరల్) : నందనపల్లె గ్రామ పరిధిలో జలవనరులు, నగర వనం, పట్టా భూములు కలిగిన రైతులకు సంబంధించిన భూములను మంగళవారం కర్నూలు ఆర్‌డీఓ కిడారి సందీప్ కుమార్ పరిశీలించారు. గతంలో సరిహద్దుల సమస్యలు పరిష్కరించాలని గ్రామ రైతులు దరఖాస్తు చేసుకున్న నేథ్యంలో ఆర్‌డీఓకు భూములను పరిశీలించారు. 136 సర్వే నంబర్ హద్దులను వారంలోపు పక్కాగా గుర్తించాలని కర్నూలు రూరల్ తహసీల్దార్ టీవీ రమేష్ బాబు, మండల సర్వేయర్ సుధాకర్‌ను ఈ సందర్భంగా ఆర్డీఓ ఆదేశించారు.



భూములను పరిశీలిస్తున్న కర్నూలు ఆర్డీఓ కిడారి సందీప్ కుమార్

ప్రతి పల్లెలో బెల్టు దుకాణాలు



హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్‌ను నిలదీస్తున్న జెడ్పీటీసీ చంద్రశేఖరరెడ్డి



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

- 24 గంటలూ అందుబాటులో మద్యం
- అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు
- మండల మీట్‌లో జెడ్పీటీసీ ఆర్‌జీ చంద్రశేఖరరెడ్డి

గడివేముల: కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మద్యం దుకాణాలు సమయపాలన పాటించడం లేదని 24 గంటలకు ప్రజలకు మద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందని గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గడివేముల ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ నాగమద్దమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభమైనా మండలస్థాయి అధికారులు హాజరు కాలేదు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఆయా శాఖల అధికారులకు ఫోన్ చేయడంతో కిందిస్థాయి ఉద్యోగులు హాజరై మమా అనిపించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా ఎంపీడీఓ వాసుదేవగుప్త ఒక్కరే అన్నితానానై సమాధాలు ఇచ్చారు. గ్రామాల్లో కూటమికి చెందిన వారికి బెల్ట్ ధుకాణాలకు అనుమతి ఇవ్వడంతో మద్యం ఏరులై పారుతుందని, చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ దృష్టికి తీసుకొచ్చారు. అధికారులు స్పందించి గ్రామాల్లో బెల్ట్ దుకాణాల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు పార్టీలకు అతీతంగా పనిచేయాలని, లేనిపక్షంలో నంద్యాల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. మండల కేంద్రం గడివేముల గ్రామ పరిధిలోని బొల్లవరం రస్తాలోని మంచి నీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకుందని ఎంపీటీసీ సభ్యుడు మహేశ్వరరెడ్డి సభ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్ గతంలోనే రెండు మంచినీటి ట్యాంకుల నిర్మాణానికి అనుమతుల కోసం ప్రభుత్వానికి పంపామన్నారు. తహసీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన గ్రామసభలలో వచ్చిన అర్జీలను పరిష్కారించేందుకు కృషి చేస్తామన్నారు. త్వరలోనే ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల మంజూరు చేస్తుందన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు ఐదు నెలల నుంచి జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గడిగరేవుల సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి సభ దృష్టికి తీసుకురాగా త్వరలోనే అందిస్తామని ఎంపీడీఓ తెలిపారు. ప్రొటోకాల్‌ను పాటించడంలేదని ప్రజాప్రతినిధులు అధికారుల తీరును తప్పుపట్టారు . కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ కాలునాయక్, ఏఈలు భాస్కర్, పవన్, ఏఓ హేమ సుందర్ రెడ్డి, సర్పంచ్‌లు అంజనమ్మ, శేఖర్, నాగేశ్వరరెడ్డి,వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు రమాదేవి, రామస్వామి, సావిత్రి, పార్వతమ్మ, కో అప్షన్ సభ్యుడు ఉశేన్‌భాషా,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం



సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆంజనేయులు

కల్లూరు: రీసర్వే, ఇతర భూముల సమస్యలపై రైతులు అందజేసిన వినతులను సకాలంలో పరిష్కారిస్తామని తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు. మంగళవారం పుసులూరు గ్రామంలో తహసీల్దార్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.మండల సర్వేయర్ శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నెరవాడలో గ్రామసభ



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడలో మంగళవారం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి భూముల రీసర్వే సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించిన తహసీల్దార్ పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్‌రెడ్డి, ఆర్ఐ రామ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు,తదితరులు

గడివేముల: పాఠశాల అండర్ 14 రాష్ట్రస్థాయి బాల్‌బ్యాట్‌మెంటన్ పోటీలకు కరిమద్దెల జిల్లా పరిషత్ ఉన్నపాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని నిర్మల ఇందు ఎంపిక య్యారు. ఈ నెల 7న అన్నమయ్య జిల్లా అంగళ్లు జెడ్పీ పాఠశాల ఆవరణలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో నిర్మల ఇందు పాల్గొంటారని వ్యయామ ఉపాధ్యాయుడు బాల వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థినిని హెచ్ఎం ప్రతాప్, మాజీ సర్పంచ్ డాలుస్వామి, గ్రామ నాయకులు పుల్లయ్య, శ్రీరాములు ఈశ్వరరెడ్డి, శివారెడ్డిలు అభినందించారు.

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఎం అనుపమ

సి.బెళగల్: అనుకోకుండా సంభవించే విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని డీపీఎం అనుపమ ప్రజలకు సూచించారు. మండలంలోని కొత్తకోట గ్రామంలో మంగళవారం జాతీయ విపత్తుల నివారణ సంస్థ (ఎన్డీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో ప్రజలు వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు తుంగభద్ర నది తీర కరకట్టపై గ్రామస్తులు, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహ కల్పించారు. డీపీఎం మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు, ప్రకృతి ప్రకోపాలతో ఏర్పడే తుపాన్, వరదల సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలతో ధైర్యంగా ఎదుర్కొని ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కాపాడుకోవాలన్నారు. అనంతరం ఎన్డీఆర్ఎఫ్ సీఐ గౌరవ్ యాదవ్ ఆధ్వర్యంలో సిబ్బంది స్థానికులు, సచివాలయ ఉద్యోగులకు వరదల సమయంలో వ్యవహరించాల్సిన తీరుపై నదిలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీటీ పురుషోత్తం, కోడుమూరు ఫైర్ స్టేషన్ ఎస్ఐ దౌలత్, ఎంపీటీసీ సభ్యుడు మణిమోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సైఫుల్లబేగ్, వీఆర్వో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



డాక్టర్ అమర్‌నాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

ఓర్వకల్లు: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 104 సిబ్బంది మంగళవారం హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. అమర్‌నాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం 104 సిబ్బంది మాట్లాడుతూ మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 2020 విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు జీఓ నంబర్–7 ద్వారా వేతనాలు చెల్లించాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్‌ను తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ పద్ధతిని అమలు చేయాలని నిఖిల్, సోమశేఖర్ కోరారు.



డాక్టర్ కిరణ్‌కు వినతి పత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

గడివేముల: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం 104 ఉద్యోగులు స్థానిక పీహెచ్‌లో డాక్టర్ కిరణ్‌కు వినతి పత్రం అంజేశారు. పదహారేళ్లుగా గ్రామీణ పేదలు సేవలు అందజేస్తున్నామని, అవుట్ సోర్స్, కాంట్రాక్టు ఉద్యోగులు కంటే చాలా తక్కువ వేతనాలకు పని చేస్తూ అన్యాయానికి గురవుతున్నామని ఈ సందర్భంగా 104 ఉద్యోగుల వెంకటేశ్వర్లు, షభాతుల్లా ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆదోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

స్కిల్ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

సి.బెళగల్: మండలంలోని గ్రామాల్లో చేపట్టనున్న స్కిల్ సర్వే (నైపుణ్య గణన)ను పకడ్బందీగా చేపట్టాలని ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు స్కిల్ సర్వేపై అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ సర్వే విధానాలను వివరించారు. ప్రతి ఇంటిని ఉద్యోగులు సందర్శించి వివరాలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపర్‌డెంట్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ముస్తక్, లక్ష్మినాథ్, అభిషేకం పాల్గొన్నారు.